# పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్
- పోలింగ్ కోసం ఏర్పాట్ల పరిశీలన



బెల్లంపల్లి : ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ బదావత్



రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో మాట్లాడుతున్న రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

బెల్లంపల్లి, నవంబర్ 29: నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. బెల్లంపల్లి పట్టణంలోని తిలక్‌స్టేడియం ఆవరణలో ఎన్నికల సామగ్రిని బుధవారం పోలింగ్ అధికారులకు ఆయన పంపిణీ చేశారు. నిర్ధేశించిన సమయానికి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం నాలుగు గంటల లోపు కేంద్రం లోపల ఉన్నవారందరికీ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సామగ్రి వెంట వెళ్లే పోలీస్ బందోబస్తుపై బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు విశ్వజిత్ దత్తా సామగ్రి పంపిణీ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. సెక్టోరియల్ అధికారులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, ఏడు మండలాల్లో 227 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 283 ఈవీఎంలతో పాటు 317 వీవీ ప్యాట్లను పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం పోలీస్ బందోబస్తుతో 60 ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ అధికారులు, సామగ్రిని తరలించారు.

**మండలంలో 18,776 మంది ఓటర్లు**

నెన్నెల,నవంబర్ 29: నెన్నెల మండలంలోని 23 పోలింగ్ బూత్‌లలో మొత్తం 18,776 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను అమర్చారు. గొల్లపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా అధికారులు గుర్తించి ఓటర్లను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఓటరు క్యూలో నిలబడకుండా కూర్చొండే ఏర్పాట్లు చేశారు. స్వాగత తోరణాలు, రెడ్ కార్పెట్ , పూల తోరణాలతో అలంకరించారు.

**తాండూర్‌లో..**

తాండూర్, నవంబర్ 29 : మండలంలో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. మండలంలో 15 గ్రామపంచాయతీల పరిధిలో 26,739 మంది ఓటర్లు ఉండగా 37 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు రూట్లుగా విభజించి నలుగురు సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందిని నియమించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యవేక్షణకు గాను వరంగల్ నుంచి వచ్చిన డీఎస్పీ పాండు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలో 4 రూట్ మొబైల్, క్విక్ రియాక్షన్, స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

**కన్నెపల్లి మండలంలో..**

కన్నెపల్లి, నవంబర్ 29 : నేడు జరిగే ఎన్నికల కోసం కన్నెపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వేమనపల్లి మండలంలో..**

వేమనపల్లి, నవంబర్ 29 : వేమనపల్లి మండలంలో నేడు జరిగే ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ సదానందం తెలిపారు. మండలంలో మొత్తం 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బుధవారం సాయంత్రం ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, ప్రత్యేక బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లుతెలిపారు. నీల్వాయిలోని ఆదర్శ పోలింగ్ కేంద్రానికి వచ్చిన పోలింగ్ సిబ్బందికి మండల పంచాయతీ అధికారి, సెక్టార్ అధికారి శ్రీపతి బాపురావు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

**కాసిపేట మండలంలో..**

కాసిపేట, నవంబర్ 29 : కాసిపేట మండలంలో పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం లోపు ఎన్నికల సిబ్బంది చేరుకొని పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మొత్తం 35 పోలింగ్ కేంద్రాలు ఉండగా నాలుగు రూట్లు ఉన్నాయి. పురుష ఓట్లు 13538, మహిళా ఓట్లు 13326, ట్రాన్స్ జెండర్ ఓట్లు 4 ఉండగా మొత్తం 26868 ఓటర్లు ఉన్నారు.




వేమనపల్లి : నీల్వాయి ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బందికి స్వాగతం పలుకుతున్న ఎంపీవో , సిబ్బంది



కాసిపేట : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది



నెన్నెల : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

# అభివృద్ధికి కేరాఫ్ బెల్లంపల్లి..

బెల్లంపల్లి, నవంబర్ 29: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. మారుమూల గ్రామాల్లో కూడా సీసీ రోడ్లు, బీటీ రోడ్డు మంజూరై కళకళలాడుతున్నాయి. వేమనపల్లి, కన్నెపల్లి, భీమిని మండలాల్లో వర్షా కాలంలో బ్రిడ్జిలు లేక గ్రామాలతో సంబంధాలు తెగిపోయేవి. నూతన బ్రిడ్జిలు ఏర్పాటు కావడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి పట్టణంలో రూ. 16 కోట్లతో వంద పడకల దవాఖాన, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ప్రజల చిరకాల వాంఛ సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకున్న వారికి పట్టాలు అందించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేక చొరవతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. దీంతో నియోజకవర్గం అభివృద్ధి పతంలో దూసుకుపోతున్నది. తొమ్మిదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారు.

**అభివృద్ధి పనుల్లో ప్రధానమైనవి..**

రూ.77 కోట్ల తో కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల్లో 22 బ్రిడ్జిల నిర్మాణం

–రూ. 200 కోట్లతో గ్రామాలకు బీటీ రోడ్లు

*బెల్లంపల్లి పట్టణంలో 75 లక్షలతో గ్రంథాలయ భవనం

–*రూ.14 కోట్లతో బెల్లంపల్లి మున్సిపాలిటీ కన్నాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రైల్వే స్టేషన్ ఏరియా వరకు సెంట్రల్ లైటింగ్

–ఎన్‌ఆర్‌ఈజీఎస్, సీడీపీ, డీఎంఎఫ్ రూ.140 కోట్ల నిధులతో సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణం

–సీఎస్‌ఆర్ ఫండ్స్‌తో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి 10 కోట్లు

–రూ.16 కోట్లతో వంద పడకల దవాఖాన ...డయాలసిస్ కేంద్రం ఏర్పాటు

–రూ.4 కోట్లతో 20 కొత్త హెల్త్ సబ్‌సెంటర్ల ఏర్పాటు

–బెల్లంపల్లి పట్టణ ప్రజల చిరకాల వాంఛ సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకున్న వారికి ఇళ్ల పట్టాల పంపిణీ

–రూ. 80 కోట్లతో పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు భవనాలు

–రూ.3 కోట్లతో వేమనపల్లి మండలం లక్ష్మీపూర్ వద్ద 32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్



బెల్లంపల్లి వందపడకల దవాఖాన

## మరో సారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి..

బెల్లంపల్లి నియోజకవర్గంలో రెండు సార్లు ఆశీర్వదిస్తే గతంలో లేని విధంగా అభివృద్ధి చేసి చూపించాను. గత తొమ్మిదిన్నర ఏళ్లలో స్థానికంగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉన్నాను. మంచి, చెడుకు ప్రజలకు అండగా నిలిచాను. వంద పడకల దవాఖాన, డయాలసిస్ కేంద్రం తీసుకువచ్చి పేదల ముంగిట కార్పొరేట్ వైద్యాన్ని తీసుకువచ్చాను. నాలుగేళ్లు శ్రమించి ఎన్ని అడ్డంకులు ఎదురైనా సీఎం కేసీఆర్ సహకారంతో ఓ కొలిక్కి తీసుకువచ్చి బెల్లంపల్లి ప్రజల చిరకాల వాంఛ పట్టాల పంపిణీని తీర్చాను. మారుమూల మండలాల్లో బ్రిడ్జిలు, బీటీ రోడ్లు నిర్మించాను. మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాను. మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాను. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తాను.

**-బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య**

# పోలింగ్ వేళ ..ఇవి తెలుసుకో..

కోటపల్లి, నవంబర్ 29 : ఓటు వేసే సమయం ఆసన్నమయింది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది.

**ఓటేయాలంటే ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి..**

ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుకు ఓటరు చీటీతో పాటు ఎన్నికల సంఘం ఆమోదించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాలి. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, ఈజీఎస్ జాబ్ కార్డ్, పింఛన్ మంజూరు పత్రం, దివ్యాంగుల గుర్తింపు కార్డు, ఫొటో ఉన్న బ్యాంక్, పోస్టాఫీసు పాస్ పుస్తకం, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన గుర్తింపు కార్డు, కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, ఫొటో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల లిమిటెడ్ కంపెనీల ఉద్యోగి గుర్తింపు కార్డు

**మన ఓటును మనం చూసుకోవచ్చు**

ఈవీఎంల ద్వారా ఓటింగ్ జరగనుండగా, మనం ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని అక్కడ అమర్చిన వీవీ ప్యాట్ ద్వారా చూసుకోవచ్చు. ఈవీఎం ద్వారా ఓటు వేసిన అనంతరం తాను ఎవరికి ఓటు వేశామన్నది ఏడు సెకన్ల వరకు డిస్‌ప్లే కావడంతో పాటు ఓటు వేసిన చిట్టి వీవీ ప్యాట్‌లో పడిపోతుంది.

**ఉదయం 5:30 గంటలకే మాక్ పోలింగ్**

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 5:30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఏజెంట్ల సమక్షంలో ఏజెంట్ల ద్వారా 50 ఓట్లు వేస్తారు. తర్వాత వారి సమక్ష్యంలో ఎవరెవరికి ఎన్ని ఓట్లు వేశారనే విషయాన్ని చూపించి క్లియర్ చేస్తారు. తర్వాత నిజమైన పోలింగ్‌ను ప్రారంభిస్తారు .